క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ అధ్యక్షుడికి విరాళం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్ద నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబ ఆలయ నిర్మాణానికి కర్నూలు ప్రభుత్వాస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవకృష్ణ, డోన్ ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రమ్యశిల్ప దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు భాష్యం రమణగౌడ్‌ను కలిసి విరాళం మొత్తాన్ని అందించారు. కమిటీ సభ్యులు దాతలను పట్టుశాలువతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, పార్థ, మల్లికార్జునరెడ్డి, రమణ ఉన్నారు.

శబరిమలకు పాదయాత్ర



పాదయాత్రకు బయలుదేరిన అయ్యప్పస్వాములు

డోన్ టౌన్: అయ్యప్పస్వామి సన్నిధానం శబరిమలకు డోన్ నుంచి మహా పాదయాత్రగా 8 మంది భక్తులు తరలి వెళ్లారు. ఆదివారం స్థానిక తత్వమసి అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముడి ధరించి పాదయాత్రగా బయలుదేరారు. కొత్తపల్లికి చెందిన గురుస్వామి మల్లికార్జున, రవి, శేఖర్, విశ్వనాథ్, కుమార్, సురేష్, రాజేష్, సత్యం, చలం ఉన్నారు. వీరంతా మకర సంక్రాంతి నాటికి శబరిమలకు చేరుకుని జ్యోతి దర్శనం చేసుకోనున్నట్లు తెలిపారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు అందుకున్న చిగురుమానుపేట మహిళలు

డోన్: ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జడ్చర్ల పట్టణానికి చెందిన నతానియల్, జోత్స్న దంపతుల ఆర్థిక సహాయంతో చిగురుమానుపేటలోని పలువురు పేద మహిళలకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ప్రార్థన సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షాబ్జీకి నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు నివాళులర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, బాబు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు బాలరంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, లతీఫ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినీ క్రిస్మస్ వేడుకలు

బేతంచెర్ల: పట్టణంలోని హోసన్నా మందిరంలో జరిగిన మినీ క్రిస్మస్ వేడుకలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏసు ప్రభువు అనుగ్రహంతో అందరికీ మంచి జరగాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు శామ్యూల్, ప్రసాద్, స్వామి దాసు, మేకల నాగరాజు పాల్గొన్నారు.

పెన్షనర్ల డేను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్

డోన్: స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీ పెన్షనర్స్ డేను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్స్ డే కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్టీఓ రఘునందన్‌తో పాటు పలువురు బ్యాంక్ మేనేజర్లు హాజరవుతారన్నారు. గత ఏడాది ప్రభుత్వ పెన్షనర్ల కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గాలయ్య, గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, కోశాధికారి గోపాల్, సభ్యులు లోకనాథరెడ్డి, దాసప్ప, రామదాసురెడ్డి పాల్గొన్నారు.



పంటలను కప్పేసిన పొగ మంచు

పంటలపై పొగమంచు ప్రభావం

కొలిమిగుండ్ల: ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను నష్టాలకు గురిచేస్తున్నాయి. పంట చేతికొచ్చేలోపు ఏదో ఒక రూపంలో తుడిచిపెట్టుకుపోతున్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఏపుగా పెరిగి బాగుందనుకున్న తరుణంలో ఫెంగల్ తుపాన్ వల్ల కురిసిన వర్షాలకు పూత రాలిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. కొద్దిరోజుల నుంచి పొగమంచు ఎక్కువగా కురుస్తోంది. దీంతో రబీలో పండించిన శనగ పంటకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పూత రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఇటీవలే వర్షాలు కురవడంతో శనగ పంటకు ఊరట లభించింది. అయితే పొగ మంచు వల్ల నష్టం ఏర్పడుతుందని రైతులు పేర్కొంటున్నారు.



కోవెలకుంట్ల సమీపంలో జొన్న పంట చుట్టూ ఏర్పాటు చేసిన ఫ్లిక్కర్స్

జొన్న పంటకు ఫ్లిక్కర్స్‌తో రక్ష..!

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన జొన్న కంకిదశలో ఉండడంతో పంట చుట్టూ ఫ్లిక్కర్స్(మెరిసే రిబ్బన్లు) ఏర్పాటు చేసుకుని పక్షులబారి నుంచి కాపాడుకుంటున్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 5 వేల ఎకరాల్లో సాగైన మహేంద్ర, హైబ్రీడ్ రకానికి చెందిన జొన్న చేతికందే దశలో పక్షులు కంకిపై వాలి నష్టం చేకూరుస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు కొందరు రైతులు జొన్న పంట చుట్టూ మెరిసే రిబ్బన్లు అమర్చారు. ఎండ, గాలికి రిబ్బన్లు మెరుస్తూ కదులుతుండడంతో పక్షులు పంటవైపు రావడం లేదని రైతులు చెబుతున్నారు.



పశుగ్రాసానికి పెరిగిన డిమాండ్

కొలిమిగుండ్ల: వరికోతలు ప్రారంభం కావడంతో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. అవుకు, బనగానపల్లె మండలాల పరిధిలోని గ్రామాల్లో విస్తారంగా వరి సాగు చేస్తుంటారు. కొద్ది రోజుల నుంచి యంత్రాల సాయంతో వరికోతలు జోరుగా జరుగుతున్నాయి. రెండు మండలాల నుంచి కొలిమిగుండ్ల మీదుగా రోజు 20కి పైగానే వరిగడ్డి ట్రాక్టర్లు అనంతపురం జిల్లాకు రవాణ అవుతున్నాయి. తాడిపత్రి చుట్టు పక్కల ప్రాంతాల్లో వరిసాగు తక్కువగా ఉండడంతో పశువుల మేత కోసం ఏటా అక్కడి నుంచి రైతులు ట్రాక్టర్లలో తీసుకెళుతుంటారు. వరిగడ్డిని ఎకరాల ప్రకారం కొనుగోలు చేస్తుంటారు. మొదట్లో ఎకరాకు రూ.3వేల మేర వరకు కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.1500 వరకే తీసుకెళ్తున్నారు. ట్రాక్టర్లలో వరిగడ్డిని రవాణ చేసే సమయంలో కొలిమిగుండ్లలో ప్రధాన రహదారిపై వ్యాపార సముదాయాల వద్ద అడ్డగోలుగా బైక్‌లు, కార్లు పార్కింగ్ చేస్తుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

మినీ గోకులాలు.. బిల్లుపై సందేహాలు

- గతంలో నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించకుండా చేతులెత్తేసిన టీడీపీ ప్రభుత్వం
- ఇప్పుడు మరోసారి హడావుడి
- నియోజకవర్గంలో 75 మినీ గోకులాల మంజూరు
- ఆసక్తి చూపని రైతులు

డోన్ రూరల్: పశువులు ఉన్న పాడి రైతులు షెడ్లు నిర్మించుకోవడానికి గోకులాల పేరుతో గత టీడీపీ ప్రభుత్వం (2014–19) హయాంలో పథకం తీసుకొచ్చింది. పశువుల షెడ్లకు 10 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్లకు 30 శాతం వాటా రైతులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన వాటా ఉపాధి హమీ పథకం కింద ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. అయితే గతంలో గోకులాలు నిర్మించుకున్న కొంత మందికి బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందారు. ఇక రాదని తెలిసి చేసేదేమి లేక మిన్నకుండిపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ మినీ గోకులాలు అంటూ హడావుడి చేస్తోంది. అయితే బిల్లులు సకాలంలో వస్తాయో, రావోనని వీటిని నిర్మించుకునేందుకు రైతులు ముందుకు రావడంలేదు.

షెడ్ల నిర్మాణాలకు రాయితీ

డోన్ నియోజకవర్గంలో 75 మినీ గోకులాలు మంజూరయ్యాయి. మండలానికి 25 షెడ్ల చొప్పున టార్గెట్ ఇచ్చారు. వాటి నిర్మాణానికి ఉపాధి హమీ పథకం జాబ్‌కార్డు తప్పనిసరి చేయగా, గ్రామసభ ఆమోదం తీసుకోవాల్సి ఉంది. పశువుల షెడ్లకు 90 శాతం, మేకలు, గొర్రెలు, కోళ్ల షెడ్లకు 70శాతం ప్రభుత్వం నుంచి రాయితీ అందుతుంది. షెడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత జాతీయ ఉపాధి హమీ పథకం నిధుల నుంచి యజమానుల ఖాతాకు రాయితీ బదిలీ చేస్తారు.



గతంలో నిర్మించుకున్న మినీ గోకులం పశువుల షెడ్డు

బిల్లులు సకాలంలో వస్తేనే..

అయితే మినీ గోకులాలు దరఖాస్తు చేసుకున్న వారందరూ బిల్లులు సకాలంలో వస్తేనే నిర్మాణాలను ప్రారంభిస్తామని, లేకుంటే చేయమని చెబుతున్నారు. గతంలో కట్టుకోండి ఇస్తామని అధికారులు చెప్పడంతో వస్తాయనే నమ్మకంతో వెంటనే నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో ఏం చేయలేని స్థితిలో ఉండిపోయారు. బిల్లులు వస్తే నిర్మాణాలను ప్రారంభిస్తామని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తేల్చి చెబుతున్నారు. దరఖాస్తులు కూడా తక్కువగానే వచ్చినట్లు సమాచారం.

డోన్ నియోజకవర్గంలో మంజూరైన మినీ గోకులాలు

మండలం	యూనిట్లు
డోన్	25
ప్యాపిలి	25
బేతంచెర్ల	25
మొత్తం	75

ఇంత వరకు బిల్లులు రాలేదు



మాది డోన్ మండలం ఎద్దుపెంట గ్రామం. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో (2014–19) బిల్లులు ఇస్తాం గోకులాలు నిర్మించుకోమని చెప్పారు. దీంతో సుమారు రూ.2.30 లక్షలు అప్పు చేసి పశువుల షెడ్ నిర్మించుకున్నారు. కానీ ఇంత వరకు రూపాయి బిల్లు రాలేదు. ఇలా చేయడం వల్ల చాలా ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు మరోసారి మినీ గోకులాలు అంటూ హడావుడి చేస్తున్నారు. బిల్లులు వస్తాయనే నమ్మకం లేదు.

–సాంటి కృష్ణ, రైతు, ఎద్దుపెంట గ్రామం

ఉపాధి హామీ నిధులతో గోకులాల నిర్మాణాలు



ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులను ఎంపిక చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న పత్రాలను పశుసంవర్ధక శాఖ ఏడీ, ఎంపీడీఓ, ఏపీఓ, పశువుల డాక్టర్లు పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించారు. ఎంపికైన వారి పేర్లు కూడా వచ్చాయి. పశువులకు 10 శాతం, మేకలు, గొర్రులు, కోళ్లకు 30 శాతం వాటా రైతులు చెల్లించాలి. గోకులాలు మంజూరైన వారు 10 శాతం డీడీ చెల్లించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

–ఎ.నాగరాజు, పశుసంవర్ధకశాఖ ఏడీఏ, డోన్

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండలంలోని నందిపాడు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా పెట్టిన మోటార్ సైకిల్ తీయమని అడిగినందుకు నందిపాడు గ్రామానికి చెందిన జింకల మధు అనే వ్యక్తిని చంద్రమోహన్, రమణయ్య, శేఖర్ రాయితో కొట్టి గాయపరిచినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని చెప్పారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

డోన్/డోన్ టౌన్: స్థానిక శ్రీసుధ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం సికొకాయ్ కరాటే ఇంటర్నేషనల్ ఇండియా సంస్థ నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో పలువురు విజయం సాధించారు. కర్నూలు జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ కరాటే మాస్టర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో బెల్ట్‌గ్రేడింగ్ నిర్వహించారు. రామ్స్ స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. చక్రధర్, వేదాన్స్, పియూష్, మహిధర్, జాహ్నవి, దాక్షాయణి, సృజన, ప్రియసాగర్, మోక్షజ్ఞ, తేజ ఎల్లో బెల్టులను, సుధీర్, అశ్వర్థ్ ఆరెంజ్ బెల్టులను, సాయిచరణ్, భానుప్రకాష్, బాలాజీ, అభినయ, సాయికీర్తన, చందన గ్రీన్ బెల్టులను, లౌక్య, ఆసిఫా పర్పుల్ బెల్టు, హిమతేజ, అభిరాం, చరణ్‌తేజ, నవదీప్ బ్లూ బెల్టు, నిఖిల్, చరణ్, రాజేష్ బ్రౌన్ బెల్టులను సాధించారని కరాటే మాస్టర్ రమణ వెల్లడించారు.



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

రమేష్ ఆచారికి శిరోమణి అవార్డు

బనగానపల్లె రూరల్: మండలంలోని పసుపల గ్రామానికి చెందిన రమేష్‌ఆచారి జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు. ఇటీవల తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జ్యోతిష్య శాస్త్రంపై సెమినార్ ఇచ్చారు. టీటీడీ అర్చకులు రంగాచార్యులు, నిర్వాహకులు నరసింహస్వామి, నారాయణచార్యులు, శుక్రాచార్య యూనివర్సిటీ సీఓ గోపినాథ్, అరుణ్ మహేష్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న రమేష్ ఆచారి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన రవి, రమేష్ సొంత పని నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్ల వచ్చారు. కర్నూలు జిల్లా సి. బెళగల్ మండలం కొత్తకోటకు చెందిన సుదర్శన్ కలుగొట్లలోని కాశీనాయన ఆరాధనోత్సవాలకు వచ్చి తిరిగి బైక్‌పై వెళుతుండగా కోవెలకుంట్ల మండలంలోని జోళదరాశి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: పట్టణ పరిధిలోని కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న కుందూనది వంతెన వద్ద ఆదివారం ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళుతున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని.. ఎవరూ అధైర్యపడవద్దని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్ మండలం దేవరబండ గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి ఇటీవల మృతిచెందడంతో ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్టీసీ డ్రైవర్ క్రిష్ణారెడ్డి కుమారుని వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు కురుకుంద హరి, ఓబులాపురం సుధాకర్ ఉన్నారు.



దేవరబండలో లక్ష్మీకాంతరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బుగ్గన

త్రుటిలో తప్పిన ప్రమాదం

అవుకు: శింగనపల్లె గ్రామ సమీపంలో ఆదివారం బొలెరో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాల్వలోకి దూసుకెళ్లింది. అవుకు నుంచి బొలెరో మ్యాక్స్ ట్రక్‌లో పోట్ల కట్టెలను వేసుకొని సుంకేసుల గ్రామానికి వెళ్తుండగా శింగనపల్లె వద్ద ఓ విద్యార్థి మోటర్ సైకిల్‌పై అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చాడు. అతన్ని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న మోరీని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లింది. బైక్‌పై వచ్చిన విద్యార్థి సడన్ బ్రేక్ వేయడంతో కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని అవుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బొలెరో వాహన డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించకుంటే విద్యార్థికి పెద్ద ప్రమాదం జరిగిఉండేదని స్థానికులు తెలిపారు.



కాలువలోకి దూసుకెళ్లిన బొలెరో



డోన్: ఆర్డీఓ నరసింహులు ఆధ్వర్యంలో..



మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్



బనగానపల్లె: నివాళులర్పిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె: పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ



కోవెలకుంట్ల: తహసీల్దార్ కార్యాలయంలో..

అమరజీవి త్యాగఫలితమే భాషా ప్రయుక్త రాష్ట్రాలు

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- వాడవాడలా పొట్టి శ్రీరాములు వర్ధంతి
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

డోన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితమే మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి భాష ప్రయుక్త రాష్ట్రమైన తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి చివరకు ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, ఎంపీటీసీ సభ్యులు ఓబులాపురం సుధాకర్, క్లస్టర్ యూనివర్సిటీ సభ్యులు నాగభూషణంరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు మిట్టా రవికుమార్, పాలుట్ల రఘురాం, మేడా రఘు, నాయకులు మౌలాలి, సోమేష్ యాదవ్, మహేంద్ర, శేఖర్‌యాదవ్, మేకల రాజు, మాబు, సుధాకర్, వెంకటేష్, క్రిష్ణారెడ్డి, క్రిష్ణ, రఫీ, మధుసూదన్‌రెడ్డి, అశోక్, వలి పాల్గొన్నారు. అలాగే రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ నరసింహులు, రెవెన్యూ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్ నివాళులర్పించారు.



డోన్‌లో అమరజీవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

బనగానపల్లె రూరల్: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె పాత బస్టాండ్ సర్కిల్‌లోని శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరమణ, పీఆర్‌టీయూ కార్యాలయంలో ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు శీనయ్య, జంగంశెట్టి, పీఆర్‌టీయూ నాయకులు రాంపుల్లారెడ్డి, బాలమద్దిలేటి, సజ్జాద్, రఘు, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

- డోన్ టౌన్: తెలుగు ప్రజల గుండెల్లో పొట్టి శ్రీరాములు చిరస్థాయిగా నిలిచిపోయారని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామాంజనమ్మ, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ అన్నారు. పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.
- కోవెలకుంట్ల: స్థానిక అమ్మవారిశాల ఆవరణలో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ పుల్లయ్య అమరజీవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నలిగిపోతున్న తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మురళీకృష్ణ, నాగరాజు, వీఆర్వోలు రాజశేఖర్‌రెడ్డి, బాలమద్దిలేటి పాల్గొన్నారు.
- బేతంచెర్ల: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఇబ్రహీం, అంజి, ఎల్లయ్య, గోపాలు, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మారుతి, వీఆర్వోలు, ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ మల్లికార్జున, సూపరింటెంట్ దస్తగిరిబాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు నివాళులర్పించారు.



బేతంచెర్ల: నివాళులర్పిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల